## విహార యాత్రలో విషాదం.. మారేడుమిల్లిలోని జలపాతంలో ఇద్దరు మెడికోల మృతి

మొదటి పేజి తరువాయి

తోటి విద్యార్థులు అతికష్టమ్మీద ఇద్దరిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాజమండ్రిలోని పర్యాటక ప్రదేశం మారేడుమిల్లిలో ముగ్గురు వైద్యవిద్యార్థులు గల్లంతయ్యారు. అందులో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలను అధికారులు సోమవారం ఉదయం గుర్తించారు. గల్లంతైన మరో విద్యార్థి కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. సరదాగా మొదలైన ఆ విద్యార్థుల విహారయాత్ర చివరకు విషాదంగా ముగిసింది. విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు ఆశ్రమ వైద్య కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఆదివారం మారేడుమిల్లికి విహారయాత్రకు వచ్చారు. అందరూ ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఇందులో పదిమంది అమ్మాయిలు కాగా నలుగురు అబ్బాయిలు ఉన్నారు. మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతంలో విద్యార్థులు సరదాగా ఈత కొట్టారు. ఈ క్రమంలోనే భారీ వర్షం కురవడంతో జలపాతంలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో నీళ్లలో ఉన్న సీహెచ్ హరదీప్, కే సౌమ్య, బీ అమృత, హరిణిప్రియ, గాయత్రి పుష్ప ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఇది గమనించి మరికొందరు విద్యార్థులు నీళ్లలోకి దిగి హరిణిప్రియ, గాయత్రిపుష్పలను అతికష్టమ్మీద ఒడ్డుకు చేర్చారు. వారిని హుటాహుటిన రంపచోడవరం ఆసుపత్రికి తరలించారు. మిగతా ముగ్గురు విద్యార్థులు కొట్టుకుపోయిన విషయాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కూడా రంగంలోకి దిగి విద్యార్థుల కోసం గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం పార్వతీపురం జిల్లా బొబ్బిలికి చెందిన సౌమ్య, బాపట్లకు చెందిన అమృత మృతదేహాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన మరో యువకుడు హరదీప్ ఆచూకీ ఇంకా దొరకలేదని వివరించారు. కాగా, హరిణిప్రియ పరిస్థితి సీరియస్ గా ఉండడంతో రంపచోడవరం ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

## పోలీసుల అత్యుత్సాహం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరిగిందో చూశాం

హైదరాబాద్ : అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు... పోలీసుల అత్యుత్సాహం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏం జరిగిందో మనం చూశాం... పోలీసు అధికారులు చట్టాలకు లోబడి పని చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో గూండాయిజం, అత్యాచారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే 2 వేలకు పైగా అత్యాచారాలు జరిగాయని విమర్శించారు. శాంతిభద్రతల్లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హైదరాబాద్, దేవరకద్రలో నిన్న ఒక రోజే రెండు అత్యాచారాలు జరిగాయన్నారు. కానీ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి కేసుల్లో నిందితులకు కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై నిన్న రాత్రి కాంగ్రెస్ గూండాలు దాడులు చేశారని ఆరోపించారు. ఈ దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రాత్రి సమయంలో ఇంటి ముందు పటాకులు పేల్చి, తలుపులు తీయించి మరీ దాడులు చేయడమేమిటన్నారు. ఈ దాడికి సంబంధించి విజువల్స్ కూడా ఉన్నాయన్నారు. ఈ ఘటనపై వెంటనే డీజీపీ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అన్నింటా వైఫల్యం చెందిందని, వీటి నుంచి డైవర్ట్ చేసేందుకు రేవంత్ రెడ్డి హైడ్రా పేరుతో హైడ్రామాకు తెరలేపారని విమర్శించారు. రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో పంటపొలాలు ఎండిపోతున్నాయని, మరోవైపు లక్షలాది మంది డెంగ్యూ, చికెన్ గున్యాతో బాధపడుతున్నారని, వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైడ్రాకు హైకోర్టు కీలక ఆదేశాలు..!!

మొదటి పేజి తరువాయి

హైడ్రా కూల్చివేతలపై న్యాయస్థానం స్టే విధించింది. స్థానికల పిటిషన్ పైన హైకోర్టు విచారణ చేసింది. 2014లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ పైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలు అయింది. దీంతో హైకోర్టు హైడ్రాకు కీలక సూచనలు చేసింది. దుర్గం చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేశారంటూ హైడ్రా స్థానికులకు నోటీసులు జారీ చేసింది. నెల రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేసింది. ఈ నోటీసుల పైన స్థానికులు హైకోర్టును ఆశ్రయించారు. 2014లో జారీ చేసిన ప్రిలిమరీ నోటిఫికేషన్ పై దుర్గం చెరువు పరిసర నివాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వీటిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ప్రొటెక్షన్ కమిటీ స్థానికుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. అక్టోబర్ 4న ప్రొటెక్షన్ కమిటీ ముందు నివాసితులు హాజరు కావాలని కోర్టు పేర్కొంది. అదే సమయంలో అక్టోబర్ 4 నుంచి ఆరు వారాల లోపు నోటిఫికేషన్ జారీ చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కోర్టు తాజా ఆదేశాలతో దుర్గం చెరువు నివాసితులకు తాత్కాలికంగా ఊరట దక్కింది. మరోవైపు నగరంలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. మాదాపూర్ లో హైడ్రా సిబ్బంది కావూరి హిల్స్ పార్కు స్థలంలో వెలసిన అక్రమ షెడ్లను కూల్చివేశారు. పార్కులో స్పోర్ట్స్ అకాడమీపై గత కొంతకాలంగా కావూరి హిల్స్ అసోసియేషన్ ఫిర్యాదులు చేసింది. దీంతో తక్షణమే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ముందుగా స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణాలను తొలగించారు. అనంతరం కావూరి హిల్స్ పార్క్ అని అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. అయితే కావూరి హిల్స్ అసోసియేషన్ నుంచి 25 ఏళ్ల పాటు తాము లీజుకు తీసుకున్నామని స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు వాదిస్తున్నారు. గడువు ముగీకముందే అన్యాయంగా నిర్మాణాలను తొలగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తాజాగా హైకోర్టు హైడ్రాకు ఇచ్చిన ఆదేశాలతో దుర్గం చెరువు వాసులకు రిలీఫ్ దక్కింది.

## రాముడు వనవాసానికి వెళితే భరతుడిలా బాధ్యతలు చేపట్టా: ఢిల్లీ సీఎం అతిశీ

ఢిల్లీ: రామాయణంలో రాజ్యాన్ని వదిలిపెట్టి రాముడు వనవాసానికి వెళితే ఆయన పాదుకలకు పట్టం కట్టి పాలించిన భరతుడిలా ఢిల్లీ ప్రభుత్వ బాధ్యతలు చేపట్టానని సీఎం అతిశీ పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా నేపథ్యంలో శనివారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అతిశీ.. ఈరోజు ముఖ్యమంత్రి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ పై తనకున్న భక్తిని చాటుకున్నారు. గతంలో కేజ్రీవాల్ ఉపయోగించిన కుర్చీని పక్కన పెట్టుకుని తాను మరో కుర్చీలో ఆసీనులయ్యారు. ఆ కుర్చీ ఎప్పటికైనా కేజ్రీవాల్ దేనని చెప్పారు. నాలుగు నెలల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ప్రజలు మరోమారు కేజ్రీవాల్ కు పట్టం కడతారని, ఈ కుర్చీలో మరోమారు ఆయనను కూర్చోబెడతారని తనకు విశ్వాసం ఉందన్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. రామాయణంలో భరతుడితో తనను తాను పోల్చుకున్నారు. రాముడు వనవాసం వెళితే ఆయన తరఫున ప్రతినిధిగా పాలనా బాధ్యతలను భరతుడు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం తాను కూడా అదేవిధంగా బాధ్యతలు చేపట్టానని వివరించారు. నాలుగు నెలల తర్వాత కేజ్రీవాల్ తిరిగి ఇక్కడికి (సీఎంవోకు) వస్తారని, అప్పటి వరకు పాలన కుంటుపడకుండా తాను చూసుకుంటానని అతిశీ చెప్పుకొచ్చారు.

## చందమామపై బయటపడ్డ భారీ బిలం.. ప్రగ్యాన్ రోవర్ పరిశోధనలో గుర్తింపు



ఢిల్లీ: చంద్రుడి దక్షిణ ధ్రువంపై భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) విజయవం తంగా విక్రమ్ ల్యాండర్ ను దింపిన విషయం తెలిసిందే. చంద్రయాన్ 3 ప్రాజెక్టులో భాగంగా విక్రమ్ ల్యాండర్ తో పాటు ప్రగ్యాన్ రోవర్ ను ఇస్రో చంద్రుడిపైకి పంపింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన తర్వాత ప్రగ్యాన్ రోవర్ అక్కడి పరిస్థితిని ఫొటోలు తీసి పంపించింది. విక్రమ్ ల్యాండర్ నుంచి కొద్దిదూరం పాటు ప్రయాణించి చుట్టుపక్కల ప్రాంతాలను ఎక్స్ ప్లోర్ చేసింది. ఈ క్రమంలోనే అక్కడ భారీ బిలంను గుర్తించింది. ల్యాండ్ అయిన ప్రదేశాన్ని, దాని చుట్టుపక్కల ప్రాంతాలను ప్రగ్యాన్ రోవర్ ఫొటోలు తీసి విక్రమ్ ల్యాండర్ కు పంపగా.. విక్రమ్ వాటిని ఇస్రోకు చేరవేసింది. ఇలా అందుకున్న ఫొటోలను ఇస్రో శాస్త్రవేత్తలు విశ్లేషించి ఈ బిలంను గుర్తించారు. దాదాపు 160 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ బిలం చాలాకాలం కిందటే ఏర్పడిందని వారు అంచనా వేస్తున్నారు. సాధారణంగా అగ్ని పర్వతం బద్దలైనపుడు ఇలాంటి బిలాలు ఏర్పడతాయని చెప్పారు. చంద్రుడి సౌత్ పోల్ కు సుమారు 350 కిలోమీటర్ల దూరంలో ఈ బిలం ఉందని వివరించారు. కాగా, చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా ల్యాండైన విక్రమ్, అందులో పంపిన ప్రగ్యాన్ రోవర్ ప్రస్తుతం స్లీపింగ్ మోడ్ లో ఉన్నాయి. అక్కడ రాత్రి సమయం దాదాపు మనకు పద్నాలుగు రోజులు.. ఆ సమయంలో ఉష్ణోగ్రతలు మైనస్ కు పడిపోతాయని, ఆ ఉష్ణోగ్రతలో విక్రమ్ ల్యాండర్, ప్రగ్యాన్ రోవర్ లు పనిచేయలేవని సైంటిస్టులు వివరించారు. వాటి బ్యాటరీలు పూర్తిగా డ్రై అయిపోయాయని వివరించారు. ప్రస్తుతం అవి రెండూ చంద్రుడిపై నిద్రిస్తున్నాయని సైంటిస్టులు చెప్పారు.

# పవన్ ముందు చిన్నబోయిన ఏపీ బీజేపీ

మొదటి పేజి తరువాయి



ప్రత్యర్థులు చేసిన తప్పులను ఎండగట్టటమే కాదు.. దానికి సంబంధించిన చేపట్టాల్సిన కార్యక్రమాలు చాలానే ఉంటాయి. కానీ.. ఆ విషయంలో ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిచ్చేలా మారింది. శ్రీవారి లడ్డూ కల్తీ ఎపిసోడ్ మొత్తాన్ని చూస్తే.. టీడీపీ.. జనసేన దూకుడు ముందు ఏపీ బీజేపీ నేతల వెలవెలపోవటమే కాదు.. వారి వాయిస్ ఎక్కడా కనిపిస్తున్న పరిస్థితి లేదు. నిజానికి కమలనాథులు చేయాల్సిన పనిని జనసేన అధినేత.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్నారని చెప్పాలి. లడ్డూ అంశాన్ని తీవ్రంగా తీసుకోవటమే కాదు.. మిగిలిన రాజకీయ పార్టీల తీరుకు భిన్నంగా పవన్ ప్రకటిస్తున్న నిర్ణయాలు మిగిలిన రాజకీయ పార్టీలకు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. సాధారణంగా ఒక దుర్మార్గ ఘటన జరిగినప్పుడు దాన్ని తీవ్రంగా ఖండించటం.. దాని మీద ఘాటు విమర్శలు చేయటం మామూలే. అందుకు భిన్నంగా లడ్డూ ఎపిసోడ్ లో సగటు హిందువుగా ప్రాయశ్చిత దీక్ష చేపట్టిన పవన్ తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో మరే పార్టీ అధినేత కానీ.. కరుడుకట్టిన హిందుత్వ వాదులు సైతం తీసుకోని నిర్ణయాన్ని తీసుకోవటం ద్వారా పవన్ కొత్త విధానానికి తెర తీశారని చెప్పాలి. అలా అని అన్యమతం మీద ఆయన విరుచుకుపడటం లేదు. ఒక ధర్మానికి జరిగిన నష్టాన్నిమాట్లాడటం.. మిగిలిన ధర్మాల పట్ల మర్యాద.. గౌరవాల్ని ప్రదర్శించటం ద్వారా.. అందరికి ఆమోదయోగ్యమైన విధంగా పవన్ తీరు ఉంటుందని చెబుతున్నారు. నిజానికి పవన్ చేయాల్సిన దీక్షను.. ఏపీ బీజేపీకి చెందిన అగ్రనేతలు కలిసికట్టుగా చేయటం.. దాన్నో ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. అలాంటి వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవటంలో వెనుకపడ్డారని చెప్పాలి. నిజానికి దేశ రాజకీయాల్లో సాఫ్ట్ హిందుత్వ పార్టీల లేమి ఎప్పటి నుంచో వెంటాడుతోంది. ఆ కొరతను తీర్చిన మొదటి పార్టీగా జనసేనను చెప్పాలి. నిజానికి ఈ అవకాశాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ అందిపుచ్చుకుంటుందని.. అదే జరిగితే జాతీయ స్థాయిలో బీజేపీకి ప్రత్యామ్నాయ పార్టీగా నిలుస్తుందని పలువురు భావించేవారు. కానీ.. కేజ్రీవాల్ ఆ దిశగా అడుగులు వేయలేదు. యానివర్సరీ రిటర్న్ గిఫ్ట్ ఈ విషయంలో జనసేనాని కొత్త పంథాను ఎంచుకున్నారని చెప్పాలి. సాఫ్ట్ హిందుత్వలో.. హిందువుల పక్షపాతిగా.. వారికి అండగా ఉండటం.. వారి ప్రయోజనాలకు భంగం వాటిల్లే అంశాల పట్ల ఓపెన్ మాట్లాడటం.. సెక్యులర్ శక్తులుగా చెప్పుకునే పక్షాలకు భయపడకుండా ధీటుగా వాదనల్ని వినిపించటమే కాదు.. అన్య మతాల పట్ల కించిత్ తగ్గని గౌరవాభిమానాల్ని ప్రదర్శించటం ఉంటుంది. ఈ తరహా బ్లెండ్ ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీకి లేదనే చెప్పాలి. పవన్ తీరు ఇందుకు తగ్గట్లే ఉంది. తాజాగా ఆయన చేపట్టిన దీక్షతో అది ఝూడీ అయ్యిందని చెప్పాలి. ఏమైనా.. శ్రీవారి లడ్డూ కల్తీ వేళలో.. ఏపీలో మరింత హోల్డ్ పెంచుకోవాల్సిన బీజేపీ.. తమకంత సీన్ లేదన్న విషయాన్ని చెప్పకనే చెప్పేసిందని చెప్పాలి.

## తొలిసారి: ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ వార్నింగ్

మొదటి పేజి తరువాయి



తానుముఖ్య మంత్రిగా కుదురుకోవటం మీదనే ఫోకస్ చేసిన ఆయన.. ఇప్పుడు ఎమ్మెల్యేల మీద దృష్టి పెట్టారా? అంటే అవునన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందుకు తగ్గట్లే తనదైన శైలిలో ఎమ్మెల్యేలకు సిం'ఫుల్' వార్నింగ్ ఇవ్వటం ఆసక్తికరంగా మారింది. ఇటీవల టీపీసీసీ కొత్త రథసారథిగా ఎంపికైన మహేశ్ కుమార్ గౌడ్ ను సన్మానించేందుకు హైదరాబాద్ మహానగరంలోని ఒక స్టార్ హోటల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేయటం గమనార్హం. 'మన ఎమ్మెల్యేలు బాధ్యతతో మెలగాలి. అవినీతికి దూరంగా ఉండాలి. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల బదిలీలు.. ఇతర విషయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డబ్బులు తీసుకోవటంతో వారిని ప్రజలు ఓడించారు. మన ఎమ్మెల్యేలు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎమ్మెల్యేలు సచివాలయానికి గుంపులు గుంపులుగా రావొద్దు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండండి. పని చేయండి. అప్పుడే వారు మరోసారి గెలిపిస్తారు" అని వ్యాఖ్యానించటం గమనార్హం. పార్టీలోని కొందరు ఎమ్మెల్యేలు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారని.. వారంతా జాగ్రత్తగా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్.. 'ప్రతి ఎమ్మెల్యే సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు సమయాన్ని కేటాయించాలి. బీసీ జనగణన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. త్వరలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందజేస్తాం. ఈ కార్డు ఆధారంగానే సదరు కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయి" అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నంచి ఇప్పటివరకు ప్రతిపక్షాల నుంచి వచ్చే విమర్శల్ని తిప్పి కొట్టే విధంగా కాంగ్రెస్ నేతలు పని చేయట్లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. తాజాగా ఆ అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించటం గమనార్హం. "ప్రతిపక్షాల విమర్శల్ని తిప్పి కొట్టేందుకు సన్నద్ధంగా ఉండాలి. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి పదవులువస్తాయి. పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన 36 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చాం. అధికారం కోల్పోయిన ప్రతిపక్షం అసహనంతో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోంది. పార్టీ నేతలు వాటిని తిప్పి కొట్టాలి. ఇంచార్జి మంత్రులు వారానికి రెండుసార్లు తమకు కేటాయించిన జిల్లాల్లో పర్యటించాలి. వచ్చే ఎన్నికల్లో నాలుగోసారి గెలిచి అధికారంలోకి వచ్చేందుకు జమిలి ఎన్నికల్ని మోదీ తీసుకొస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలి" అంటూ హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకుతాను ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదన్న ముఖ్యమంత్రి.. ప్రభుత్వం చేపడుతున్న కొత్త కార్యక్రమాల్ని ప్రజల్లోకి ఎమ్మెల్యేలు తీసుకెళ్లాలన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా 27 రోజుల్లో రూ.18వేల కోట్ల మేరకు రైతుల రుణాల్ని మాఫీ చేశామన్న రేవంత్.. "ప్రభుత్వానికి ప్రతి నెలా 18వేల కోట్ల ఆదాయం వస్తోంది.ఇందులో జీతభతయాలు.. అప్పుల వాయిదాలు.. వడ్డీలకే రూ.12వేలకోట్లు పోతున్నాయి. మిగిలిన రూ.6వేల కోట్లతోనే సర్దుబాటు చేసుకుంటూ వస్తున్నాం. దుబారా ఖర్చులు పూర్తిగా తగ్గించాం" అంటూ తమ ప్రభుత్వం చేస్తున్న కసరత్తును చెప్పుకొచ్చారు.

## లడ్డూ వివాదంపై కేసీఆర్ మౌనం ఎందుకు..?

మొదటి పేజి తరువాయి



ఆ పార్టీ అధినేత కేసీఆర్ కానీ.. ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావులు కానీ ఎక్కడా మాట్లాడింది లేదు. ఆ పార్టీ తరఫున కూడా ఎవరూ ఈ అంశంపై నోరు మెదపలేదు. ఖండించింది లేదు.. టీటీడీ మీద మాట్లాడిందీ లేదు. కేసీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాటి ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో సత్సంబంధాలు ఉన్నాయి. చాలా సందర్భాల్లోనూ ఇద్దరు కలుసుకున్నారు. రాష్ట్రాల సమస్యలపై చర్చించారు. పలు సమస్యలను కొలిక్కి తీసు కొచ్చారు. కేసీఆర్ ఏపీకి సైతం వెళ్లారు. జగన్ కూడా హైదరాబాద్ కేసీఆర్‌తో చాలా సార్లు భేటీ అయ్యారు. దాంతో వారిద్దరి మధ్య ఉన్న అనుబంధం గురించి అందరికీ తెలిసిందే. పేరుకు రెండు పార్టీలు, రెండు రాష్ట్రాల సీఎంలు అయినా సోదరుల్లా కలిసిపోయేవాళ్లు. ఇప్పుడు ఒకే టర్మ్‌లో ఇక్కడ కేసీఆర్, అక్కడ జగన్ అధికారాలు కోల్పోవాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం లడ్డూ వివాదం రోజురోజుకూ ముదురుతోంది. దీనిపై అన్ని పార్టీలు స్పందించాయి. ఇప్పటికే బీజేపీ నేతలు విచారణ చేపట్టాలని కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లేఖ రాశారు. అటు కాంగ్రెస్ పార్టీ తరఫున కూడా ఖండించారు. ప్రభుత్వం తరఫున విజయ డెయిరీ నుంచి నెయ్యి సప్లయ్ చేస్తామంటూ ఆఫర్ కూడా ఇచ్చారు. ఇలా వన్ బై వన్ అందరూ స్పందిస్తుంటే.. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నేతలు స్పందించకపోవడం ఇప్పుడు చర్చకు దారితీసింది. అయితే.. లడ్డూ వ్యవహారం అంతా కూడా జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సందర్భంలోనే జరగడంతో.. ఆయనతో ఉన్న సత్సంబంధాల నేపథ్యంలోనే కేసీఆర్ స్పందించడం లేదా అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ కాకున్నా.. ఆ పార్టీ తరఫున మరే ఇతర నేతలైనా స్పందించాస్తారేమోనని చూసినప్పటికీ ఎక్కడా ఎవరూ నోరు మెదపకపోవడంపై మరిన్ని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంలో కీలక పరిణామం..

మొదటి పేజి తరువాయి

లడ్డూ తయారీకి జంతువుల కొవ్వుతో కల్తీ చేసిన నెయ్యి వాడారన్న వార్త ఇప్పుడు కలకలం రేపుతోంది. జాతీయ స్థాయిలో దీనిపై చర్చ జరుగుతోంది. ఇటు ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లోనూ తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపించిన ల్యాబ్ రిపోర్ట్స్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారాయి. ప్రపంచ నలుమూలలకు చెందిన కోట్లాది మంది భక్తులు కల్తీ లడ్డూ విషయమై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది మంది ఆరాధ్య దైవమైన వేంకటేశ్వరుడి తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందనే విషయాన్ని భక్తులు జీర్ణించుకోవడం కష్టంగా మారింది. దీనికి కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలంటూ సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు కోరుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలపై వెంటనే విచారణ జరపాల్సిందిగా బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి మాట్లాడుతూ... తిరుమల ప్రసాదం లడ్డూపై చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ ఆరోపణలు భక్తులను గందరగోళానికి గురి చేస్తున్నాయన్నారు. సమగ్ర విచారణ కోసం ఓ కమిటీని వేయాలని పిటిషన్‌లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారూ్ర%డా పేరుతో సమస్యను డైవర్ట్ చేస్తున్నారు. నిజానిజాలు బయటకు రావాలనే ఉద్దేశంతో అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇదిలాఉంటే.. శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఏపీ హైకోర్టులో ఓ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై కోర్టు ఇవాళ మధ్యాహ్నం 2.15 గంటలకు విచారణ జరపనుంది.

## మోదీ మాకు సవాల్ విసిరారు.. భారత ప్రధానితో భేటీపై సుందర్ పిచాయ్ వ్యాఖ్య

మొదటి పేజి తరువాయి

సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా మోదీ మాట్లాడుతూ.."గతేడాది వాషింగ్టన్ వచ్చినప్పుడు.. మీలో కొందరితో సమావేశమయ్యే అవకాశం లభించింది. మరోసారి ప్రపంచంలో ప్రముఖ ఆవిష్కర్తలతో కూర్చోవడం గర్వంగా ఉంది. భారత్‌పై మీకున్న ఉత్సాహం, నమ్మకం మాకు ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయి. మీరు ఇచ్చిన సూచనలు ఎంతో విలువైనవి" అని అన్నారు. అనంతరం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ.. "భారత్‌ను మార్చడంపై ప్రధాని మోదీ దృష్టి సారించారు. ఇది డిజిటల్ ఇండియా విజన్. భారత్‌లోనే తయారీ, డిజైనింగ్ ఉండాలని ఆయన మమ్మల్ని అడిగారు. ఇప్పుడు మా పిక్సెల్ ఫోన్లను భారత్‌లో తయారుచేయడం గర్వంగా ఉంది. ఏఐతో భారత ప్రజలకు లభించే ప్రయోజనాల గురించి మోదీ ఆలోచిస్తున్నారు. ఈ సరికొత్త సాంకేతికతను విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో ఉపయోగించేలా ఆలోచించేలా ఆయన మాకు సవాలు విసిరారు. భారత్‌లో ఏఐ మరింత విస్తరించేలా మేం ముందుకువెళ్తున్నాం. మోదీ స్పష్టమైన విజన్‌తో ఆలోచనలు చేస్తున్నారు" అని పిచాయ్ అన్నారు.గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంతను నారాయణ్, ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహా 15 కంపెనీల సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోను ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. సీఈవోలతో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నోవేషన్ అంశాల గురించి చర్చించామని తెలిపారు. 'మేడ్ బై ఇండియా' గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు.

## తిరుమల కల్తీ లడ్డూపై సిట్ కు ఆదేశించిన ప్రభుత్వం?

అమరావతి : తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం దేశ వ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. లడ్డూ కల్తీపై సిట్ దర్యాప్తుకు కూటమి ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం. దర్యాప్తు అధికారిగా ఎవరిని నియమించాలనే దానిపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సాయంత్రానికి దర్యాప్తు అధికారి పేరు, విధివిధానాలతో జీవోను విడుదల చేసే అవకాశం ఉంది. తిరుమల లడ్డూ కల్తీపై సిట్ ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. నిన్న మంత్రులతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పేనని ఆయన అన్నారు. తిరుమలలో మహా అపచారానికి పాల్పడ్డారని చెప్పారు. టీటీడీని వ్యాపార సంస్థగా, రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని మండిపడ్డారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నెయ్యి, ఇతర సరకుల సరఫరాకు సంబంధించి రివర్స్ టెండర్ల పేరుతో నిబంధనలు మార్చారని చంద్రబాబు మండిపడ్డారు. నిబంధనల ప్రకారం డెయిరీకి ఉండాల్సిన మూడేళ్ల కనీస అనుభవాన్ని ఏడాదికి తగ్గించారని విమర్శించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో ఇష్టానుసారం వ్యవహరించారని దుయ్యబట్టారు. అనుభవం లేని వారికి కాంట్రాక్ట్ ఇవ్వడంతో... వారు నాసిరకం నెయ్యిని సరఫరా చేశారని ముఖ్యమంత్రి చెప్పారు. స్వామివారి పవిత్రమైన లడ్డూలో పంది కొవ్వు కలిసిందని తెలిసి ఎంతో మంది బాధపడ్డారని చెప్పారు. కల్తీ నెయ్యితో హిందువుల మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## చైల్డ్ పోర్నోగ్రఫీ ఏ రూపంలో ఉన్నా నేరమేనని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ : చైల్డ్ పోర్నోగ్రఫీ ఏ పరిస్థి తుల్లో, ఏ రూపంలో వున్నా సరే నేం మేనని దేశ అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆ వీడియోలు చూసినా, డౌన్ లోడ్ చేసుకున్నా, షేర్ చేసినా.. పోక్సో చట్టం వర్తిస్తుందని స్పష్టత నిచ్చింది. న్యాయస్థానాలు చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదమే వాడకూడదని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఈమేరకు మద్రాసు హైకోర్టు తీర్పును సోమవారం జరిగిన విచారణలో సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

ఇదీ కేసు..

చైల్డ్ పోర్నోగ్రఫీ వీడియోలను డౌన్ లోడ్ చేసుకున్నాడనే ఆరోపణలపై 28 ఏళ్ల యువకుడిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో ప్రవేశ పెట్టారు. కింది కోర్టు శిక్ష ఖరారు చేయడంతో ఆ యువకుడు మద్రాసు హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ తర్వాత హైకోర్టు తీర్పు చెబుతూ.. వీడియోలు డౌన్ లోడ్ చేసుకున్నప్పటికీ ఆ యువకుడు వాటిని ఎవరికీ షేర్ చేయలేదని, ఎవరినీ వేధించలేదని పేర్కొంటూ సదరు యువకుడిపై క్రిమినల్ చర్యలు నిలిపివేయాలని మద్రాసు హైకోర్టు గత జనవరిలో తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్ దాఖలు చేశారు. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ పిటిషన్లను సోమవారం విచారించింది. మద్రాసు హైకోర్టు తీర్పును ఈ బెంచ్ తప్పుబట్టింది. చైల్డ్ పోర్నోగ్రఫీ ఏ రకంగా ఉన్నప్పటికీ అది పోక్సో చట్టం కింద నేరార్హమేనని తీర్పు చెప్పింది.

ప్రభాత సూర్యుడు


సంపాదకీయం

## సరైన దిశలో తొలి అడుగు

### (విశ్లేషణ)

కోర్టు నోరు విప్పిందంటే న్యాయం నిలబడుతుందని సామాన్యులకు ఆశ. దేశంలో చట్టాలను తుంగలో తొక్కుతున్న బుల్‌డోజర్ సంస్కృతిపై మంగళవారం దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు కాసింతైనా సంతోషం కలిగిస్తున్నది అందుకే. అనేక రాష్ట్రాలలో క్రిమినల్ కేసుల్లో దర్యాప్తును ఎదుర్కొంటున్న నిందితులు, వారి కుటుంబ సభ్యుల ప్రైవేట్ గృహాలు, ఆస్తు లపై బుల్‌డోజర్లను నడిపిస్తూ... 'దాన్ని ఘనకార్యంగా పేర్కొంటూ, సమర్థించుకుంటున్న' వైఖరి పాలకుల సాక్షిగా పెచ్చుమీరుతోంది. ఈ పరిస్థితుల్లో తదుపరి విచారణ జరిగే అక్టోబర్ 1 దాకా దేశవ్యాప్తంగా ఈ అడ్డగోలు కూల్చివేతలన్నిటికీ సుప్రీమ్ కోర్ట్ అడ్డుకట్ట వేయడం విశేషం. అదే సమ యంలో నీటి వసతులు, రైల్వే లైన్లకు అడ్డుగానూ, ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాల్లోనూ సాగిన దురా క్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ కూల్చేందుకు అభ్యంతరం లేదని సుప్రీమ్ పేర్కొంది. అలాగే, కూల్చివేతలపై దేశవ్యాప్తంగా అమలయ్యేలా నిర్ణీత మార్గదర్శకాల్ని రూపొందించాలన్న కోర్ట్ ప్రతిపాదన హర్షణీయం. ఇన్నాళ్ళ తరువాత ఇప్పటికైనా ఇది సరైన దిశలో సరైన అడుగు. యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తరప్రదేశ్‌లో 2017లో ఈ బుల్‌డోజర్ న్యాయానికి బీజం పడింది. ఆ తరువాత ఇది అనేక బీజేపీ పాలిత రాష్ట్రాలకు పాకింది. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఇప్పటికి 4.5 లక్షల దాకా గృహాలు ఇలా నేలమట్టమయ్యాయని అంచనా. ఇకపై చట్టవిరుద్ధంగా ఒక్క కూల్చివేత జరిగినా అది పూర్తిగా రాజ్యాంగ విధానానికే విరుద్ధమని కోర్ట్ పేర్కొనడం గమనార్హం. నిజానికి, గతంలోనూ కోర్టులు ఇలాంటి వ్యాఖ్యలు చేసినా, వాటి ఆదేశాలను ధిక్కరిస్తూ అనేకచోట్ల కూల్చివేతలు యథేచ్ఛగా సాగాయి. అసలు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని నిందితుల మీదకు బుల్‌డోజర్‌ను నడిపిస్తున్న తీరుపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. తప్పు చేసినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సింది పోయి, నోటీసులైనా ఇవ్వకుండా, నిర్ణీత ప్రక్రియ ఏదీ పాటించకుండా వారికి శిక్షగా బుల్‌డోజర్‌ను ఉపయోగించడమేమిటనే ధర్మబద్ధమైన ప్రశ్నలు వినిపిస్తూ వచ్చాయి. పైపెచ్చు, ముస్లిమ్‌ల ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని కూల్చివేతలు సాగించడమనేది బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాలనా విధానంగా తయారవడం ఆందోళన రేపింది. ఈ పరిస్థితుల్లో జస్టిస్ బి.ఆర్. గవాయ్, కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీమ్ కోర్ట్ డివిజన్ బెంచ్ ఈ పద్ధతిని తప్పుబట్టింది. ఒక కేసులో నిందితులైనంత మాత్రానో, లేదంటే దోషి అయినంత మాత్రానో వారి ఇంటిని కూల్చేయవచ్చా? అందుకు చట్టం అనుమతిస్తుందా? లేదు కదా! ఆ మాటే సుప్రీమ్ అంటోంది. పైగా ఇంట్లో ఎవరో ఒకరు నేరం చేస్తే, కూల్చివేతలతో ఆ కుటుంబం మొత్తానికీ శిక్ష విధించడం ఏ రకంగా సబబు? ప్రభుత్వ పాలన నిర్వహించే కార్యనిర్వాహక వ్యవస్థే జడ్జిగా మారి, శిక్షించవచ్చా? ఆక్రమణలనూ, అనధికారిక నిర్మాణాలనూ తొలగించేందుకు వివిధ రాష్ట్రాల్లోని స్థానిక చట్టాలు అనుమతిస్తున్నాయి. కానీ, వాటిని ప్రతిపక్షాల పీక నొక్కేందుకూ, నిర్ణీత వర్గాలపై ప్రతీకారేచ్ఛకూ సాధనంగా మార్చుకోవడంతోనే అసలు సమస్య. గొంతు విప్పిన భార తీయ ముస్లిమ్‌లపై ఉద్దేశపూర్వకంగా సాగుతున్న దాడిలో భాగమే ఈ కూల్చివేతలని చివరకు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం పేర్కొనే పరిస్థితి వచ్చిందంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ బుల్‌డోజర్ న్యాయం దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో సాగుతున్నా, అన్ని చోట్లా ఒక అంశం మాత్రం సర్వసాధారణం. అది ఏమిటంటే – గతంలో కోర్టులిచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా, నిర్ణీత ప్రక్రియ అంటూ లేకుండానే ఈ కూల్చివేతలు కొనసాగడం! దురాక్రమణ లకు వ్యతిరేకంగా ఉద్యమం అంటూ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ లాంటి చోట్ల ఇటీవలి కూల్చివేతల్లోనూ చట్ట ఉల్లంఘన నిర్భీతిగా సాగింది. గుజరాత్, అస్సామ్, త్రిపురల్లో సైతం కూల్చివేతల పర్వానికి కట్టడి లేకుండా పోయింది. అసాంఘిక శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోందనే భావన కల్పిస్తూ, రాజకీయ లబ్ధి పొందడం అధికార పార్టీల వ్యూహం. దానిలోని మతపరమైన కోణాన్ని కప్పిపుచ్చడం వాటికి వెన్నతో పెట్టిన విద్య. ఈ బుల్‌డోజర్‌సంస్కృతిపై భారత అత్యున్నత న్యాయస్థానం జోక్యానికి ఇంతకాలం పట్టడం విచారకరమే. అయితే, ఇప్పుడిక పనిప్రదేశాల్లో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా 'విశాఖ' మార్గదర్శకాలు చేసినట్టుగానే దీనిపైనా అఖిల భారత స్థాయిలో కోర్టు మార్గదర్శకాలు ఇవ్వనుండడం ఒకింత ఊరట. అనధికారిక నిర్మాణాల గుర్తింపు, నోటీసులివ్వడం, వాదనలు వినడం, అనంతరం చట్టబద్ధంగా కూల్చివేతలు జరపడం... ఈ ప్రక్రియ అంతటికీ దేశవ్యాప్తంగా ఒకే విధమైన నియమావళి ఉండడం కచ్చితంగా మంచిదే. ఇటీవలి కూల్చివేతల డేటాను నిశితంగా సమీక్షిస్తే అనేక లోపాలు కనిపిస్తాయి. అందుకే, ఈ అంశంపై సంబంధిత వర్గాల నుంచి సూచనలు కోరుతున్న కోర్ట్ రేపు మార్గదర్శకాల రూపకల్పనలోనూ జాగ్రత్తగా వ్యవహరించడం కీలకం. మత ఘర్షణలు, ఆ వెంటనే సాగే కూల్చి వేతల మధ్య సంబంధాన్ని కప్పిపుచ్చేందుకు పాలకులు ఎత్తులు వేయడం తరచూ చూస్తున్నాం. ఆ పన్నాగాలు పారనివ్వకుండా మార్గదర్శకాల తయారీ అవసరం. అలాగే, ఎప్పుడో నోటీసులు ఇచ్చా మని మభ్యపెట్టేందుకు వెనకటి తేదీలతో కాగితాలు చూపించి, పాలనా యంత్రాంగం ఇష్టారీతిన సాగించే కూల్చివేతలకు చెక్ పెట్టాలి. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జరిగే ఏ చర్యలనూ అనుమతించని రీతిలో నియమావళిని కట్టుదిట్టంగా రూపొందించాలి. ఆదేశాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి, కోర్టు ధిక్కారం కింద కఠిన చర్యలు చేపట్టాలి. ప్రజలెనుకున్న పాలకులు తామే జడ్జీలుగా, తామే శిక్షలు అమలు చేసేవారిగా ప్రవర్తిస్తే అది పౌరుల ప్రాథమికహక్కులకే భంగకరం.

# అమెరికా - భారత్ మధ్య కీలక ఒప్పందం.. యంక్యూ-9బి అత్యాధునిక కిల్లర్ డ్రోన్ల సరఫరాకు డీల్..!





ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల అమెరికా పర్యటనకు వెళ్లారు. ఇవాళ రాత్రి న్యూయార్క్?లో 'మోదీ అండ్ యూఎస్ ప్రోగ్రెస్ టుగెదర్' కార్యక్రమంలో ప్రధాని పాల్గొననున్నారు.

ఈ కార్యక్రమానికి నసావు వెటరన్స్ మెమోరియల్ కొలీజియం వేదిక కానుంది

మరోవైపు భారత్ %-% అమెరికా మధ్య రక్షణ, వాణిజ్య బంధం బలపడుతోంది. ఈ క్రమంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కిల్లర్ డ్రోన్‌లను అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు జో బిడెన్ ఖరారు చేశారు. భారతదేశం అమెరికా నుండి 31 యంక్యూ-9బి (16 స్కై గార్డియన్, 15 సీ గార్డియన్) రిమోట్‌గా పైలట్ చేసే విమాన డ్రోన్‌లను కొనుగోలు చేయబోతోంది. ఈ డ్రోన్ల ధర దాదాపు 3 బిలియన్ డాలర్లు. గత ఏడాది జూన్‌లో, రక్షణ మంత్రిత్వ శాఖ అమెరికా నుండి గాలి నుండి ఉపరితల క్షిపణులు, లేజర్-గైడెడ్ బాంబులతో కూడిన యంక్యూ-9బి స్కై గార్డియన్, సీ గార్డియన్ సాయుధ డ్రోన్‌లను కొనుగోలు చేయడానికి ఆమోదించింది. భారత్-అమెరికా డిఫెన్స్ ఇండస్ట్రియల్ కోఆపరేషన్ రోడ్‌మ్యాప్‌ను మోదీ, బిడెన్ ప్రశంసించారు. ఈ రోడ్‌మ్యాప్ కింద, భారీ పరికరాలు, జెట్ ఇంజిన్‌లు, మందుగుండు సామగ్రి, గ్రౌండ్ మొబిలిటీ సిస్టమ్‌ల వంటి ఆయుధాల తయారీని చేర్చారు. ఈ ముఖ్యమైన సహకారంలో, లిక్విడ్ రోబోటిక్స్, భారత సముద్ర రక్షణ ఇంజనీరింగ్, సముద్ర భద్రతను పెంపొందించడానికి మానవరహిత ఉపరితల వాహనాల ఉత్పత్తికి కూడా ప్రాధాన్యత ఇవ్వనుంది. క్వాడ్ కాన్ఫరెన్స్ అనంతరం ఇరువురు నేతలూ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో ఇరువురు నేతలు భారత్-అమెరికా భాగస్వామ్యాన్ని చాలా పటిష్టంగా అభివర్ణించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకునేందుకు ఇరువురు నేతలు చర్చించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంతో సహా ప్రపంచ, ప్రాంతీయ సమస్యలపై సమావేశంలో చర్చించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇటీవల మోదీ ఉక్రెయిన్ పర్యటనపై ద్వైపాక్షిక సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో, యుఎస్-ఇండియా సిఇఒ ఫోరమ్‌కు కో-ఛైర్‌గా ఉన్న రెండు కంపెనీలు లాక్‌హీడ్ మార్టిన్ మరియు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మధ్య సి-130జె సూపర్ హెర్క్యులస్ ఎయిర్‌క్రాఫ్ట్‌పై టీమ్ ఒప్పందాన్ని ఇరువురు నేతలు అభినందించారు. %జ%-130 సూపర్ హెర్క్యులస్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను నిర్వహించే భారత నౌకాదళం, గ్లోబల్ పార్టనర్‌ల సంసిద్ధతకు మద్దతుగా భారతదేశంలో కొత్త మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ సదుపాయాన్ని ఈ ఒప్పందం ఏర్పాటు చేస్తుంది. యుఎస్-ఇండియా రక్షణ, ఏరోస్పేస్ సహకారంలో ఇది ఒక ముఖ్యమైన దశ. ఇది ఇరుపక్షాల లోతైన వ్యూహాత్మక, సాంకేతిక భాగస్వామ్య సంబంధాలను ప్రతిబింబిస్తుంది.

# ఢిల్లీలో కొలువుదీరిన అతిషి కేబినెట్.. మంత్రులుగా ఛాన్స్ కొట్టేసిన వారు ఎవరంటే..?



ఢిల్లీ:దేశ రాజధాని ఢిల్లీలో అనూహ్యంగా రాజకీయ పరిణామాలు మారాయి. ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాతో అతిషి సీఎంగా బాధ్యలు చేపట్టారు. అమ్ ఆద్మీ పార్టీకి చెందిన అతిషి మార్లేనా శనివారం సాయంత్రం ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 43 ఏళ్ల అతిషి ఢిల్లీలో అత్యంత పిన్న వయస్కురాలైన ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. ఐదుగురు మంత్రులతో అతిషి కేబినెట్ కొలువుతీరింది. అతిషి 1981 లో మధ్య ప్రదేశ్ లోని భోపాల్‌లో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు ప్రొఫెసర్లు, విద్యావంతుల కుటుంబం నుంచి రావడమే కాకుండా ఆమెకు విద్య పట్ల గల ఆసక్తి వల్ల ఢిల్లీలో విద్యను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించారు. ఆమె సెయింట్ స్టీఫన్స్ కాలేజీ, ఢిల్లీ యూనివర్శిటీ లో ఢిగ్రీ చేశారు%ొ% ఆ తర్వాత ఆక్స్ఫర్డ్ యూనివర్శిటీలో విద్యాభ్యాసం కొనసాగించారు. 2015 లో ఆప్ ప్రభుత్వంలో అతిషి భాగమయ్యాక, ఆమె ముఖ్యంగా విద్యాశాఖకు సంబంధించిన ఎన్నో పథకాలు అమలు చేశారు. ఢిల్లీ పాఠశాలలలో విద్యా ప్రమాణాలను పెంచడానికి తీసుకున్న చర్యలు ఆమెకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయి. పాఠశాలల్లో హ్యాపీనెస్ క్లాసెస్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ మైండ్‌సెట్ కరిక్యూలం వంటి పథకాలు అమలు చేయడం ద్వారా విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలిగారు. ప్రజల ఆరోగ్య, విద్యా సంక్షేమ పథకాలు రూపొందించడంలో భాగమయ్యారు. ఆప్ పార్టీ కి వచ్చిన రాజకీయ, న్యాయపరమైన కష్టకాలంలో, అతిషి తన అద్భుతమైన నాయకత్వంతో కీలక పాత్ర పోషించారు. పార్టీకి విశ్వాసం కలిగించేలా పనిచేయడం, ముఖ్యమైన సమయాల్లో నాయకత్వం వహించడం వంటి దృఢమైన పనితీరు ఆమెను ఢిల్లీ రాజకీయాల్లో విశిష్టంగా నిలబెట్టాయి. అతిషి సామాజిక సమానత్వం, మహిళా సంక్షేమం, విద్యా రంగం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. ఇక అతిషి కేబినెట్ విషయానికి వస్తే, సుల్తాన్‌పూర్ మజ్రా ఎమ్మెల్యే ముఖేష్ అహ్లావత్ తొలిసారిగా ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, కైలాష్ గెహ్లాట్, ఇమ్రాన్ హుస్సేన్ అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో కేబినెట్ మంత్రులుగా ఉన్నారు. అంతకుముందు సెప్టెంబర్ 17న ఎక్సైజ్ పాలసీకి సంబంధించిన కేసులో తీహార్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభా పక్ష సమావేశంలో అతిషిని శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అతిషి మార్లేనా

ఆప్ సీనియర్ నాయకులు అతిషి ఢిల్లీలోని కల్కాజీ ఎమ్మెల్యే. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో, ఆమె విద్య, పిడబ్ల్యుడి, విద్యుత్, పర్యాటకం, స్త్రీ మరియు శిశు అభివృద్ధి, అనేక ఇతర శాఖల మంత్రిగా ఉన్నారు. ఆమె ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు కూడా. 2003లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుండి చరిత్రలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం నుండి సభ్యులుగా కొనసాగుతున్నారు.

సౌరభ్ భరద్వాజ్

సౌరభ్ భరద్వాజ్ ఢిల్లీలోని గ్రేటర్ కైలాష్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో ఆరోగ్య, పట్టణాభివృద్ధి, పర్యాటక-కళా సంస్కృతి భాష, పరిశ్రమ, నీటిపారుదల, వరద నియంత్రణ మంత్రిగా ఉన్నారు. ఇంతకు ముందు ఢిల్లీ జల్ బోర్డు ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. సౌరభ్ భరద్వాజ్ ఒక ప్రైవేట్ కంపెనీలో మైక్రోచిప్స్, కోడింగ్ నిపుణుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు.

కైలాష్ గెహ్లాట్

కైలాష్ గెహ్లాట్ ఢిల్లీ దేహత్‌లోని నజఫ్‌గఢ్ అసెంబ్లీ స్థానం నుండి ఎమ్మెల్యేగా ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఢిల్లీ గ్రామీణ ప్రాంతంలో ముఖ్యమైన నాయకుడిగా ఎదిగారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో రవాణా, రెవెన్యూ, పరిపాలనా సంస్కరణలు, సమాచారం, సాంకేతికత, చట్టం, న్యాయం మరియు శాసన వ్యవహారాల బాధ్యతలను నిర్వహించారు. ఆగస్టు 15న ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్థానంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతో ఆయన వెలుగులోకి వచ్చారు.

గోపాల్ రాయ్

గోపాల్ రాయ్ ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ ఇంచార్జ్‌గా ఉన్నారు. ఢిల్లీ ప్రభుత్వంలో అత్యంత అనుభవం ఉన్న నాయకుడు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వంలో పర్యావరణం, ఇతర మంత్రిత్వ శాఖల బాధ్యతలను ఆయన నిర్వహించారు. అతను ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు కూడా. ఉద్యమ కాలం నుంచి అరవింద్ కేజ్రీవాల్‌తో అనుబంధం ఉంది.

ఇమ్రాన్ హుస్సేన్

ఇమ్రాన్ హుస్సేన్ బల్లిమారన్ అసెంబ్లీ స్థానం నుండి ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ఆయనకు మంచి పట్టు ఉంది. ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. అతను అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో ఆహార, పౌర సరఫరాలు, ఎన్నికల మంత్రిగా ఉన్నారు. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ స్టడీస్ విద్యార్థి.

ముఖేష్ అహ్లావత్

దళిత నాయకుడు ముఖేష్ అహ్లావత్ ఢిల్లీలోని సుల్తాన్‌పూర్ మజ్రా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ముఖేష్ తొలిసారి ఎమ్మెల్యే. ఆప్ ఆయనకు 2020లో సుల్తాన్‌పూర్ నుంచి టికెట్ ఇచ్చింది. అతని కంటే ముందు సందీప్ కుమార్ కూడా 2015లో సుల్తాన్‌పూర్ మజ్రా నుంచి ఆప్ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతకు ముందు ఈ సీటు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. 1993 నుంచి 2013 వరకు ఇక్కడ జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అతిషీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్న ఏకైక కొత్త ముఖం ముఖేష్ అహ్లావత్.

# డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలి.. అసదుద్దీన్ ఓవైసీ సంచలన కామెంట్స్




పండగ వచ్చినా.. పెళ్లి జరిగినా.. ఇంకా ఏ శుభకార్యమైనా ఇప్పుడు అందరికీ డీజే ర్యాలీలు తీయడం ఒక ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సరదాగా డాన్సులు చేస్తూ ఊరంతా తెలిసేలా హోరెత్తించడం ఇప్పుడు ఒక సంప్రదాయంగా మారింది. డీజే కొట్టు.. దుమ్ము రేపు అన్నట్లుగా ముఖ్యంగా యువత దీనికి బాగా ఆకర్షితులవుతున్నారు. కొందరు.. ఈ డీజే సౌండ్‌లతో చెవులకు చిల్లులు పడేలా నానా హంగామా చేస్తున్నారు. కానీ అది ఆ చుట్టుపక్కల వారికి ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. డీజే డాన్సులతో యువత చెడిపోతున్నారని, తద్వారా ప్రజల్లో దీని వల్ల ఎలాంటి మంచి సందేశం వెళ్లడం లేదని అన్నారు. అందుకే మతపరమైన ర్యాలీల్లో డీజేలపై నిషేధం విధించాలని తెలంగాణ ప్రభుత్వానికి ఒవైసీ విజ్ఞప్తి చేశారు. డీజే సంస్కృతితో ఆధ్యాత్మిక వాతావరణం కలుషితం అవుతోందని అనడంతో పాటు మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో భాగంగా చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలడంపై స్పందించారు. ఇది ఏ మాత్రం సమాజానికి పనికి వచ్చే చర్య కాదన్నారు. డీజే కావాలి అని కోరుకునే వాళ్లకు క్లబ్బులు, పబ్బులు లాంటివి సిద్ధంగా ఉంటాయని, అంతేకాని ఇలా నడిరోడ్డు మీద డీజే అంటూ పెట్టి ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడం సరికాదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల సమయంలో చార్మినార్ వద్ద డీజే బాక్స్ పేలిపోయి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానిక అధికారులు ఆ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. డీజే పేరుతో కొంతమంది చేసే వికృత చేష్టలు, విన్యాసాలతో ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయి. మరోవైపు, నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలో ఉరడీ మధు అనే యువకుడు డీజే శబ్దానికి గుండెపోటు వచ్చి మృతి చెందాడు. ఈ క్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలంగాణలో డీజేను శాశ్వతంగా బ్యాన్ చేయాలని తెలిపారు. డీజే పేరుతో యువత హద్దులు మీరి ప్రవర్తిస్తోందని.. మతపరమైన కార్యక్రమాలే కాదు.. తెలంగాణలో డీజేకు అనుమతులు ఇవ్వొద్దని.. శాశ్వతంగా నిషేధం విధించాలని అసదుద్దీన్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

## బిఆర్ఎస్ కు బలగం, బలం, బలహీనతలు

# అన్నీ హరీష్ రావే





- పిడికిలెత్తి జై కొడితే నిలువెల్లా కనపడేది 6 అడుగుల హరీష్ రావే..!
- తెలంగాణ ముఖ ద్వారాలకు హరీష్ రావే ఆశా కిరణం







-

కల్వకుంట్ల కుటుంబం పై వస్తున్న అవినీతి ఆరోపణల విమర్శ లపై దీటైన సమాధానం ఇస్తూ క్యాడర్ను కాపాడుతున్న హరీష్ రావు

- ఢిల్లీ లిక్కర్ కేసులో తిహారి జైల్లో ఉన్న కల్వకుంట్ల కవితకు అన్నీ తానై, కాపాడి, కల్వకుంట్ల కుటుంబంలో శభాష్ అనిపించుకున్న హరీష్ రావు
- బిఆర్ఎస్ కు ప్రత్యామ్నాయ నాయకుడు హరీష్ రావేనని కార్యకర్తల్లో ఉరకలేస్తున్న ఉత్సాహం

కస్బా శంకర్ రావు
చీఫ్ ఎడిటర్, ప్రభాత సూర్యుడు

ఎంతోమంది త్యాగాలు, ఎంతోమంది ఆత్మ బలిదానాలు, ఎంతో మంది మదిలో నిరాశ, నిస్పృహలు, ఏమి చేయాలో తెలియని తెలంగాణ యువత. తెలంగాణ చుట్టూ నదులు ఆవరించి ఉన్నప్పటికీ సాగునీరు లేక తెలంగాణ రైతులకు ఉరి తాళ్లు, పురుగుల మందులతో రోజు రైతుల ఆత్మహత్యలే! ఉన్నత చదువులు చదివినప్పటికీ, ఉద్యోగ అవకాశాలు లేక తెలంగాణ యువతరం ఆత్మబలి దానాలు చేసుకుంటున్న రోజులు, అన్ని రంగాలలో తెలంగాణకు వివక్షత!. ఇది తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడే కంటే ముందు ఉన్న తెలంగాణ ముఖచిత్ర పరిస్థితులు. చంద్రబాబు నాయుడి పుణ్యమో! తెలంగాణ బుద్ధి జీవుల, మేధావి వర్గాల ఫల ఫలితము కల్వకుంట్ల చంద్రశేఖర రావు అనే ఉద్యమ కిరీటం తెలంగాణ ప్రజలకు దొరికిన ఒక వజ్రం అని అనడంలో ఎటువంటి సందేహం లేదు. ప్రజాస్వామ్య బద్ధంగానే పార్లమెంటరీ సిస్టం ద్వారానే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవచ్చు అని ఒక కొత్త రాజకీయ రూపకల్పన చేసుకుని ప్రజలను ఒకవైపు ఉద్యమాలను ఇంకొక వైపు.. ఎన్నికల వైపు మరల్చుతూ కెసిఆర్ తన రాజకీయ చతురతతో ప్రజలను మమేక పరుస్తూ యావత్తు తెలంగాణ జనాన్ని ఏకత్రాటి పైకి తీసుకొచ్చి గుడి బందు, బడి బంధు, రైలు రోకో వ్యూహాలతో తెలంగాణ సమస్త జనులను జతకట్టి సకలజనుల సమ్మెగా మిలీనియం మార్చ్ తో తెలంగాణ ప్రాంతం మొత్తంలో అన్ని వర్గాల ప్రజల జేఏసీలను ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలు తెలంగాణ వైపు చూసే విధంగా వ్యూహాలను రూపొందించి, ఢిల్లీ పెద్దల మెడలు వంచి అటు బిజెపి ఇటు కాంగ్రెస్ కేంద్ర ఢిల్లీ నాయకులు భారత పార్లమెంటులో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టే పరిస్థితికి అనివార్యంగా నెట్టి వేయించడంలో కెసిఆర్ చాణుక్య, చతురత నీతి దేశ ప్రజలందరికీ తెలుసు.

పార్లమెంటులో బిల్లు పెట్టింద్రు బిల్లు పాస్ అయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇక్కడే అసలైన చిక్కుముడి!!!! తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డ తర్వాత రాష్ట్ర ప్రజలలో ఎన్నో రకాల ఆశలు, ఎన్నో రకాల బతుకుల భవిష్యత్తు లపై భరోసా కల్పించే రాజకీయ నాయకత్వం కెసిఆర్ కే ఉన్నదని ప్రజలు బలంగా నమ్మి ఎన్నికలలో ప్రజలు తమ ఓట్లను గంపగుత్తగా అప్పటి టీఆర్ఎస్ పార్టీకి వేసి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ను ముఖ్యమంత్రి చేసుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎంతోమంది మేధావులు, విద్యార్థులు, యువకులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు రాజకీయ నాయకులుగా ఎదిగినప్పటికీ, రాజకీయ లక్షణాలు ఉన్నప్పటికీ ఎంతోమంది ఉద్యమకారులు ఏర్పడినప్పటికీ మంచికో!!! చెడుకో!!! వారిని కేసీఆర్ విస్మరించడం మొదటి తప్పుగ చెప్పక తప్పదు. రాజకీయ తెరపై కి కొడుకు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మంత్రిగా, కూతురు కల్వకుంట్ల కవితను ఎంపి, ఏంఎల్సి గా, అల్లుడు హరీష్ రావుకు కీలక మంత్రి పదవులు, సడ్డకును కొడుకు సంతోష్ రావును రాజ్యసభ సభ్యునిగా , కెసిఆర్ సామాజిక వర్గానికి చెందిన వినోద్ రావును ఎంపి గా , ప్రణాళిక సంఘ అద్యక్షునిగా కీలక పదవులు కతటపెట్టి , పాలనాపరమైన ప్రభుత్వ కీలక పదవులు " వెలమ" సామాజికవర్గానికి చెందిన వారికి ప్రాధాన్యతనిస్తూ, అధికారులను తమ కులం వారినే నియమించడం, తెలంగాణ వ్యతిరేక శక్తులకు పెద్ద పేట వేయడం, వారికి మంత్రి పదవులతో పాటు కీలక బాధ్యతలు అప్ప చెప్పడం కెసిఆర్ చేసిన రెండో తప్పుగ చూడక తప్పదు.

నిజమైన ఉద్యమకారులను ఉదాహరణకు తెలంగాణ ఉద్యమాన్ని ఆట పాటలతో ఉగ్రూతలూగించిన ఉద్యమ కెరటం గద్దర్, రాజకీయ జె ఏ సి చైర్మన్ కోదండరాం, గాదె ఇన్నయ్య, అరుణోదయ విమలక్క, ప్రజా సంఘాల అభిమాని, ప్రభుత్వాలలో మధ్యవర్తిత్వం నెరవేర్చి దేశంలోనే మేధావిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రొఫెసర్ హరగోపాల్, అమరుడు మలిదశ ఉద్యమ వీరుడు మారోజు వీరన్న ను మరుగున పరచడం తెలంగాణ రూప, సిద్ధాంతకర్త అయిన ప్రొఫెసర్ జయశంకర్ ని మానసికక్షోభకు గురిచేసి, మధ్యస్థంగా తనువు చాలించినట్లు చేసిన కెసిఆర్ పై అదును కోసం దెబ్బతీయాలని వామపక్ష భావాలు గల మేధావి వర్గం గురి పెట్టుకుని ఉండి, గత ఎన్నికలలో కెసిఆర్ కు తగిన బుద్ధి చెప్పడంలో వామపక్ష మేధావులు సఫలీకృతం అయ్యారని అనడంలో ఎలాంటి సందేహము లేదు. తెలంగాణ మేధావులను పట్టించుకోకపోవడంతో పాటు వారిని పక్కకు పెట్టడం కల్వకుంట్ల చంద్రశేఖర రావు సరిదిద్దుకోలేని మూడవ తప్పు పొరపాటుగా చూడాలి. ముఖ్యమంత్రిగా ఉన్న ఈ పది సంవత్సరాల కాలంలో వీరి నుండి తీవ్ర వ్యతిరేకత కెసిఆర్ మూటగట్టుకున్నడు."టిఆర్ఎస్" ను"బి ఆర్ ఎస్"గ మార్చి దేశ ప్రజలలో కెసిఆర్ కు ఉన్న ఇమేజ్ ని కెసిఆర్ ఏ తొలగించుకున్నడు.

తెలంగాణలో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో కెసిఆర్ బి ఆర్ ఎస్ పార్టీ చిత్తుగా ఓడిపోయి అధికారము కోల్పోయిన విషయం మన కళ్ళముందే ఉన్నది. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత మొదటి ముఖ్యమంత్రిగా కెసిఆర్ తెలంగాణ ప్రాంత ప్రజలకు చిరకాలం గుర్తుంచుకునే ఎన్నో అభివృద్ధి పనులు చేసిండు అనడంలో ఎటువంటి సందేహము లేదు. మిషన్ భగీరథ కావచ్చు, మిషన్ కాకతీయ కావచ్చు, గ్రామాల నుండి మండల కేంద్ర కార్యాలయాలకు కనెక్టివిటీ రోడ్లు వేయడంలో, అప్పు సప్పులతో కరెంటు కష్టాలు లేకుండా చేయడం, కొంతవరకు రైతులలో సాగునీరు అంతించడంలో, పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులకు తాగునీరు ఇప్పించడంలో, రైతులకు రుణమాఫీ, రైతు బంధు, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, మహిళల సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంలో, పిల్లల బడులలో మధ్యాహ్న భోజన పథకాన్ని సన్నబియ్యంతో మంచి ఆహారాన్ని విద్యార్థులకు అందించడంలో, రాష్ట్రంలో పేకాటలపై పై మారకద్రవ్యాలను నియంత్రించడంలో, కెసిఆర్ ముఖ్యమంత్రిగా పదవి స్వీకరణ చేసిన వెంటనే శాంతిభద్రలపై దృష్టి పెట్టి పోలీసు శాఖకు అత్యాధునిక టాటా సుమో వాహనాలను ఇచ్చి పోలీసు శాఖకు కావలసినంత బడ్జెట్ను కేటాయించి, మత కలహాలు లేకుండా శాంతి భద్రతలను నెరవేర్చడం లోను, ప్రభుత్వాలకి తలనొప్పిగా మారిన నయీమ్ లాంటి నయ వంచకులను ఏరిపారేయడంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ కు "కితాబు" ఇవ్వక తప్పదు. అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో బి ఆర్ ఎస్ పార్టీ కెసిఆర్ చిత్తుగా ఓడిపోవడానికి కారణాలు వెతకక తప్పదు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ ను పెద్ద దిక్కు మనిషిగా ఎప్పుడూ తెలంగాణ ప్రజలు వారి గుండెల్లో ఉంచుకుంటారు.

ఇక్కడే అసలైన కిటుకు అమెరికా నుంచి వచ్చిన కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), బ్యూటీ పార్లర్ నడిపించుకుంటున్న కల్వకుంట్ల కవిత రాజ్యాంగేతర శక్తిగా అన్ని తానై కెసిఆర్ ను ప్రజలకు దూరంగా ఉంచిన సంతోష్ రావు అనే ఉద్యమంలో అడ్రస్ లేని వ్యక్తి, ఏమి తోచని ఏమి చేయలేని నిస్సహాయ, దిక్కుతోచని స్థితిలో హరీష్ రావు వెలుమ కులానికే ప్రతినిధిగా ఉంటూ అన్ని అధికార, రాజకీయ రంగాలలో కీలక భూమిక పోషించిన వినోద్ రావు వీరందరి ఉమ్మడి ఫలితమే మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గాని, అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల్లో గాని తెలంగాణ ప్రజలు వీరి అవినీతి, భూ బాగోతాలను చూసి తిరిగి కోలుకోకుండా అధికారం కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అప్పజెప్పిన్రు. కల్వకుంట్ల కవిత గూర్చి ఢిల్లీలో చీఫ్ లిక్కర్ కేసులో కుతికళ వరకు ఇరుక్కుపోయి సరిగ్గా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందు చీఫ్ లిక్కర్ కేసు కాంగ్రెస్ పార్టీకి, మరియు బిజెపి పార్టీకి బ్రహ్మాహస్త్రంగా దొరకడం ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలు పెద్ద ఎత్తున కవిత చేసిన నిర్వాకం ప్రజలలో తీసుకపోవడంతో ప్రజలు ముఖ్యంగా మహిళామణులు తెలంగాణ బతుకమ్మను ఢిల్లీ చీఫ్ లిక్కర్ కేసులో తాకట్టు పెట్టింది అనే భావనతో ఆయా ఎన్నికల్లో ప్రజలు బి.ఆర్.ఎస్ పార్టీకి, కెసిఆర్ కు వ్యతిరేకంగా ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చుకోవడం జరిగింది. ఢిల్లీ తిహారి జైల్లో దాదాపు ఆరు నెలలు జైలులో ఉండి వచ్చిన కవిత ఒకవేళ కోర్టు కేసుల నుంచి కడిగిన ముత్యంల కోర్టు తీర్పులు -??? వచ్చిన తెలంగాణ ప్రజల మనసులలో కవిత చేసినది చాలా పెద్ద నేరం అన్న విషయం అంత ఈజీగా తొలగిపోదు. గత ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ, కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఓడిపోవడానికి ఇదొక ప్రధాన కారణంగా చెప్పక తప్పదు. కల్వకుంట్ల కవిత ఢిల్లీ చీఫ్ లిక్కర్ కేసు దెబ్బకు ఉత్తరభారతం ఢిల్లీలో నీతిమంతుడని పేరు తెచ్చుకొని ఢిల్లీ ముఖ్యమంత్రిగా సేవలందిస్తున్న అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పదవి పోయిందంటే కల్వకుంట్ల కవిత ఢిల్లీ చీఫ్ లిక్కర్ కేసు తీవ్రత ఏపాటి దో మనము అర్థం చేసుకోవచ్చు. కల్వకుంట్ల కవిత దెబ్బకు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవిపోవడం దేశ ప్రజలందరూ కల్లప్పగించి చూస్తున్న వైనం. ఇక రెండో వ్యక్తి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్ ) అమెరికా నుండి వచ్చి తెలంగాణ ఉద్యమంలో నామమాత్ర పాత్ర పోషించి, తండ్రి ముఖ్యమంత్రి అయ్యాడు కావున తెలంగాణ ప్రజలు కేటీఆర్ ను ఆదరించినప్పటికీ కేటీఆర్ దుందుడుకు చర్యలతో పార్టీ అమాంతం పీకల లోతుకు కూరుకుపోయి ఉన్నది. ఇక హరీష్ రావు గూర్చి నిజానికి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి తెలంగాణ ప్రజల ఉద్యమకారుల మనసులలో హరీష్ రావుకు మంచి పేరు ఉన్నదన్న సంగతి తెలంగాణ సమాజం గురించి తెలిసిన ప్రతి ఒక్కరికి తెలుసు. బి ఆర్ ఎస్ పార్టీ లో, యావత్తు తెలంగాణలో ఇప్పటికీ మొక్కవోని ధైర్యంతో బి ఆర్ ఎస్ పార్టీ చురుకైన క్యాడర్ తో తెలంగాణ వ్యాప్తంగా నిర్మాణం ఉన్న పార్టీ, అంగబలం, అర్థబలం తో పాటు తెలంగాణ లో బలమైన మేధావి వర్గం సైతం ఇప్పటికీ కెసిఆర్ ను నమ్ముతుండడం బి ఆర్ ఎస్ పార్టీకి మరో అదనపు బలగం. మళ్లీ పార్టీకి పూర్వవైభం రావాలన్నా , యావత్తు క్యాడర్ ని ఏకత్రాటి పైకి తీసుకురావాలన్న, బి ఆర్ ఎస్ పార్టీలో ఉన్న ఏకైక నాయకుడు హరీష్ రావే అన్న విషయం క్యాడర్ గుర్తిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వయసు రీత్యా, ఆరోగ్య రీత్యా, కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు విశ్రాంతిని ఇస్తూనే బి ఆర్ ఎస్ పార్టీని బలోపేతం చేయాలన్నా??? మళ్లీ తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్న??? ఇప్పుడున్న బి ఆర్ ఎస్ పార్టీ నాయకులలో ఒక్క హరీష్ రావే కనపడుతున్నాడు. కాబట్టి హరీష్ రావుకు పార్టీ పగ్గాలు అప్పచెప్పితే బలగం, బలం, బలహీనతలు అన్ని హరీష్ రావుకే దక్కుతాయి. పార్టీని బలోపేతం చేసి మళ్లీ వచ్చే ఎన్నికల వరకు తెలంగాణలో అధికారం వైపు పార్టీని నడిపిస్తాడు అనడంలో ఎటువంటి సందేహము లేదు. అయినప్పటికీ హరీష్ రావు మీద కూడా అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ, డొక్కు స్కూటర్, రబ్బరుచెప్పులతో తో ఉన్న వ్యక్తి వేల కోట్ల ఆస్తిపరుడు ఎలా అయ్యాడు?? అనే విమర్శకుల బలమైన ప్రశ్నలను ఎలా తిప్పికొడతాడో చూడాల్సి ఉంది. అందుకే హరీష్ రావే బి ఆర్ ఎస్ పార్టీకి " బలం, బలగం, బలహీనత" హరీష్ రావు కే బి ఆర్ ఎస్ పార్టీ పగ్గాలను అప్ప చెప్పాలని పార్టీలో బలమైన వాదన ఉన్నది అనేది కొసమెరుపు.



## పెద్ద చెరువు పూడిక పనులను ప్రారంభించిన మట్టా



కల్లూరు(ప్రభాత సూర్యుడు): ఇటీవల వరదలకు పెద్ద చెరువు భారీగా మట్టి తో మరియు చెట్లు తో పుడటం తో స్థానిక రైతులు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలియజేయ్యటం తో ఈరోజు సంబంధిత అధికారులు ద్వారా కల్లూరు పెద్ద చెరువు పూడిక పనులు దెగ్గరుండి పనులు ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ . వెంటనే స్పందించి పెద్ద చెరువు పనులు చేపట్టి రైతు పంట పొలాలకు నీరు అందిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మరియు డాక్టర్ మట్టా దయానంద్ కి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదములు తెలిపిన రైతులు. ఈ కార్యక్రమం లో కల్లూరు ఏ.యమ్.సి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు మరియు కల్లూరు పట్టణ ఏనుగు సత్యం బాబు, బాగం ప్రభాకర్ చౌదరి, ఆళ్లకుంట నరసింహారావు,మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## గుండపనేని వీరయ్య అనసూర్య ల జ్ఞాపకార్థం ఊరు ఉపయోగార్థం వాటర్ ట్యాంకర్ బహుకరణ

### గుండపనేని ఉపేందర్ -అరుణ ల ధాతృత్వం.



కల్లూరు (ప్రభాత సూర్యుడు): మండలపరిధిలో పేరువంచ గ్రామ పంచాయితీ లో గుండపనేని వీరయ్య అనసూర్య ల జ్ఞాపకార్థం వారి కుమారుడు కన్నతల్లిని పుట్టిన గ్రామాన్ని మరచిపోకుండా తన వంతు సహాయంగా గ్రామ పంచాయతీ పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగ పడే కార్యక్రమం చేయడం కోసం ముందుకు వచ్చినటువంటి గ్రామానికి చెందిన గుండపనేని ఉపేందర్- అరుణ కుటుంబ సభ్యులు తన తల్లితండ్రుల గుండపనేని వీరయ్య - అనసూర్య జ్ఞాపకార్థంగా రెండు లక్షల 20 వేల రూపాయలతో ఉచిత మంచినీటి ట్యాంకర్ చేపించి వివిధ శుభకార్యలకు వినియోగించుకోవడానికి అందుబాటులోకీ తీసుకోని రావడం జరిగింది ఈ నీటి ట్యాంకర్ ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి చేతులు మీదుగా ఓపెనింగ్ చెయ్యడం జరిగింది ఈ కార్యక్రమం లో కోర్లగూడెం సొసైటీ డైరెక్టర్ జోనబోయినా గోపాల్ రావు,ప్రభాకర్, భద్రం పాల్గొని ఉపెందర్ అరుణ కు గ్రామ ప్రజలు తరపున హృదయ పూర్వక అభినందనలు తెలియ చేసారు.

## సాగర్ కాలువ గండ్లు వెంటనే పూడ్చి వరి పైర్లకు నీరు అందించాలి



ఖమ్మం(ప్రభాత సూర్యుడు): నాగార్జున సాగర్ ఎడమ కాలువ కు పడ్డ గండ్లు పూడ్చిన మరలా కాలువ కు గండి పడడం తో అసహనం వ్యక్తం చేసిన మంత్రి తుమ్మల సంబందించిన అధికారులు తక్షణమే మరమ్మత్తు చేపించాలని గండ్లు పుడ్చే పనులు పై ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ తో కార్యదర్శి రాహుల్ బొజ్జా తో మాట్లాడిన మంత్రి తుమ్మల . పనులు జాప్యం పట్ల రైతులు ఆందోళనలో ఉన్నారని తెలిపిన మంత్రి అధికారుల సమన్వయం లోపం వల్లే మరమ్మత్తు పనులు జాప్యం జరిగి నట్లు తెలిపిన మంత్రి తుమ్మల. ఈ రోజు రాత్రి కల్ల మరమ్మత్తు పనులు పూర్తి చేసి సాగర్ నీళ్ళు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు.

## అత్యవసర సమయంలో రక్త దానం చేసి మానవత్వం చాటిన కానిస్టేబుళ్లు కరుణాకర్, సుమన్



సిద్దిపేట అర్బన్(ప్రభాత సూర్యుడు): అత్యవసర సమయంలో రక్త దానం చేసి మానవత్వం చాటిన కానిస్టేబుళ్లు కరుణాకర్, సుమన్ చిన్నకోడూర్ గ్రామానికి చెందిన మహిళ సిద్దిపేట ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసరంగా ఆపరేషన్ సమయంలో ఎ పాజిటివ్ బ్లడ్ అవసరము ఉన్నదని పోలీస్ మిత్రులు ద్వారా సమాచారం తెలుసుకున్న తొగుట కానిస్టేబుల్ సుమన్ వెంటనే స్పందించి సిద్దిపేట ఎన్ ఎస్ వి బ్యాంక్ వెళ్లి బ్లడ్ డొనేట్ చేయడం జరిగింది. దౌల్తాబాద్ మండలానికి చెందిన మహిళ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అత్యవసరంగా ఆపరేషన్ సమయంలో బి పాజిటివ్ బ్లడ్ అవసరము ఉన్నదని పోలీస్ మిత్రులు ద్వారా సమాచారం తెలుసుకున్న వెంటనే స్పందించి చేర్యాల కానిస్టేబుల్ కరుణాకర్ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వెళ్లి బ్లడ్ డొనేట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న వారి యొక్క కుటుంబ సభ్యులు అత్యవసర సమయంలో బ్లడ్ డొనేట్ చేసిన కానిస్టేబుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సంవత్సరం ఈరోజు వరకు ఆసుపత్రిలో చికిత్స అత్యవసర పరిస్థితుల్లో పొందుతున్న వ్యక్తులకు, పోలీస్ అధికారులు సిబ్బంది కలసి 158 మంది రక్తదానం చేయడం జరిగింది.



## మోడీ "మన్ కీ బాత్" వినేందుకు ప్రజలు సిద్ధంగా లేరు..



న్యూఢిల్లీ,: లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శ్రీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోడీని, బీజేపీని తీవ్రంగా టార్గెట్ చేశారు. జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడం ద్వారా ఇక్కడి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను బీజేపీ హరించిందని అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్ర మోడీకి '56 అంగుళాల ఛాతీ' ఉందని చెప్పడాన్ని మీరు తప్పక చూసి ఉంటారని రాహుల్ గాంధీ అన్నారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని.. గత ఎన్నికల ఫలితాల ఆధారంగా ఆయన వ్యాఖ్యానించారు. ఇండియా బ్లాక్, కాంగ్రెస్ పార్టీలు నరేంద్ర మోడీ సైకాలజీని మార్చేశాయన్నారు. ప్రధాని మోడీ సుదీర్ఘ ప్రసంగాలు చేస్తారని, ఆయన తన భావాల గురించి మాట్లాడుతారని, కానీ నిరుద్యోగం గురించి మాట్లాడరని రాహుల్ గాంధీ అన్నారు. ముందు దేశంలో నిరుద్యోగాన్ని తొలగించండి.. ద్రవ్యోల్బణాన్ని తగ్గించండి.. యువతకు దార్శనికత ఇవ్వండి.. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వండి.. ఈ విషయాలపై మోడీ స్పందించాలన్నారు. మోడీ 24 గంటలూ తన మనసులోని మాట(మన్ కీ బాత్) ను చెబుతూనే ఉంటారని.. కానీ ప్రస్తుతం ఎవరూ ఆయన మాట వినడానికి ఇష్టపడటం లేదన్నారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు రాకపోవడంతో దేశవ్యాప్తంగా నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. ఇది నరేంద్ర మోడీ ఇచ్చిన బహుమతని విమర్శించారు.

## ఖమ్మం జిల్లాలో అత్యధిక సంఖ్యలో బీజేపీ సభ్యత్వ నమోదుచేయడమే మా లక్ష్యం

### ఎడ్ల అశోక్ రెడ్డి ఖమ్మం జిల్లా సభ్యత్వ ప్రముఖ్. ఖమ్మం జిల్లాలో మూడు లక్షల సభ్యత్వం చేయడమే మా లక్ష్యం గల్లా సత్యనారాయణ ఖమ్మం జిల్లా భాజాపా అధ్యక్షులు



తల్లాడ (ప్రభాత సూర్యుడు): భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా సభ్యత్వ ప్రముఖ్ ఎడ్లా అశోక్ రెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీ గల్లా సత్యనారాయణ సత్తుపల్లి నియోజకవర్గ పర్యటనలో భాగంగా తల్లాడ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లా సభ్యత ప్రముఖ్ ఎడ్లా అశోక్ రెడ్డి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ గారు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు స్థానిక నాయకులతో కలిసి తల్లాడ లో పలువురకు సభ్యత్వ నమోదు చేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత దశాబ్ద కాలము నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం ఉన్నటువంటి ఏకైక పార్టీ భాజాపా అని తెలిపారు. దేశవ్యాప్తంగా భాజపా సస్తాగతంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతుంది అన్నారు. అందులో భాగంగా తెలంగాణలో గత పదవ తారీకు నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రివర్యులు శ్రీ కిషన్ రెడ్డి ప్రారంభించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో కూడా విస్తృతస్థాయిలో సభ్యత్వ నమోదు జరుగుతుందని జిల్లాలో మూడు లక్షలు సభ్యత్వం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. తల్లాడ మండలంలో 12 వేల సభ్యత్వం చేయాలని ప్రతి బూతు నందు సభ్యత్వం నమోదు జరుగుతుందని తెలిపారు ఎక్కడ చూసినా భాజపాలో చేరుటకు ప్రజలు సుమకుత వ్యక్తం చేస్తున్నారని ముఖ్యంగా యువత రైతులు మహిళలు కార్మికులు పెద్ద సంఖ్యలో చేరుతున్నారని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మా నాయకులు కార్యకర్తలు ప్రతి ఇంటింటికీ వెళ్లి ఇంటికొక సభ్యత్వం నమోదు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఖమ్మం జిల్లాలో భాజాపాను అతిపెద్ద పార్టీగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని తెలిపారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మేము అన్ని స్థానాలకు పోటీ చేసి విజయం వైపు దూసుకు వెళ్తామని అన్నారు.ఏ గ్రామానికి వెళ్లిన ఏ పల్లెకు వెళ్లిన భాజపాకు బ్రహ్మరథం పడుతున్నారని స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారని తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ పాలన వలె తెలంగాణలో కూడాఅవినీతి లేని భాజాపా పాలన రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణలో ప్రజా పాలన ప్రజలను అపహాస్యం చేసే విధంగా ఉందన్నారు మన జిల్లాలో నాగార్జునసాగర్ కాలువ కింద రెండు లక్షల 54 వేల ఎకరాల పంటలు కాలువలు తెగి రైతులకు పంటలు ఎండిపోతుంటే ఇక్కడ ముగ్గురు మంత్రులు ఉండే సరిగా కాలువలు రిపేరు చేయలేక 25 రోజులు కావస్తున్న నీటిని ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వ పాలన ఉన్నది అన్నారు. ఇదే వారి ప్రజా పాలనకు అర్థం పడుతుందని అన్నారు వారు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలలో రైతు రుణమాఫీ ఏమైందని అన్నారు రైతుబంధు ఏమైందని తెలిపారు రైతులకుపంటల బీమా పథకం ఏమైందని అన్నారు రైతులు అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొర్రీలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని రైతుబంధు రైతులకు కౌలు రైతులకు రైతు కూలీలకు వేయాలనిపంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తక్షణమే కాలువలు యుద్ధ ప్రాతిపదికపై బాగు చేయించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు లేనట్లయితే రైతుల తరఫున భాజపా పోరాటం చేస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆపతి వెంకట రామారావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చావా కిరణ్, నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, జిల్లా కార్యదర్శి మున్నా, మిశ్రా మండల ప్రధాన కార్యదర్శి గాదె కృష్ణారావు, కార్యదర్శి రాయల రమేష్,మండల ఉపాధ్యక్షులు సంగీతం సాయి చంద్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు వాడవల్లి నాగేశ్వరరావు, దళిత మోర్చా మండల అధ్యక్షులు గొల్లమండల నరేష్,యువమోర్చా అధ్యక్షులు ఎల్లంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాడు వద్దన్నారు.. నేడు కావాలంటున్నారు..



ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు ఏ వైసీపీ నాయకుడు నోరు విప్పినా పవన్ కళ్యాణ్‌ను టార్గెట్ చేసేవాళ్లు. 2019 నుంచి 2024 వరకు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వైసీపీ రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగానూ టార్గెట్ చేసింది. వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించినా పవన్ కళ్యాణ్ ఎక్కడా బెదరలేదు. ప్రతి విమర్శకు సమాధానం చెబుతూ గట్టిగా ఎదురొడ్డి నిలబడ్డారు. పవన్ కళ్యాణ్ రాజకీయాలకు పనికిరారని, ఎన్నికల తర్వాత జనసేన పార్టీ ఉండబోదంటూ వైసీపీ అధ్యక్షులు జగన్‌తో సహా ఆ పార్టీలో సీనియర్ నేతలంతా ఇదే మాట చెప్పారు. కానీ ఎన్నికల ఫలితాల తర్వాత సీన్ రివర్స్ అయింది. పవన్ కళ్యాణ్‌ను తీవ్రంగా విమర్శించిన నాయకులే ఆయన నాయకత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. పవన్ సిగ్నల్ ఇస్తే చాలు జనసేనలో చేరేందుకు రెడీ అంటున్నారు. జనసేనలో ఉంటే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని కొందరు వైసీపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారట. పవన్ కళ్యాణ్‌ను విమర్శించిన నాయకులు నేడు అడ్రస్ లేకుండా పోయారనే చర్చ జరుగుతోంది. రాజకీయాల్లో ఆవేశం, అధికారం ఉందనే అహంకారం పనికిరాదని.. ఏదైనా ఆలోచించి చేయాలనేది పవన్ కళ్యాణ్ తీరు చూస్తే అర్థమవుతోంది. విపక్షంలో ఉన్నప్పుడు.. అధికారంలో ఉన్నప్పుడు పవన్ వ్యవహారశైలిలో పెద్దగా మార్పు కనిపించడం లేదట. ఎప్పుడైనా పేదవాడికి న్యాయం జరగాలనేది పవన్ సిద్ధాంతంగా పెట్టుకోవడంతోనే రోజురోజుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందనే చర్చ జరుగుతోంది.

### జనసేనకు డిమాండ్..

వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తీరు నచ్చక కొందరు నేతలు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది జనసేనలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. బాలినేని శ్రీనివాస రెడ్డి, కిలారి రోశయ్యతో పాటు మరికొందరు నేతలు తమ రాజకీయ భవిష్యత్తుకు జనసేననే బెటర్ అనే నిర్ణయానికి వచ్చారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పవన్ కళ్యాణ్‌ను తీవ్రంగా విమర్శించిన నాయకులే ఇప్పుడు జనసేనకు జై కొడుతూ ఆ పార్టీలో చేరుతున్నారు. జనసేనకు రాజకీయ భవిష్యత్తు లేదంటూ మాట్లాడిన వాళ్లే తమ రాజకీయ భవిష్యత్తు కోసం జనసేనలోకి క్యూకడుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

### పరిమితులు పెట్టడంతోనే..

జనసేనలోకి వచ్చేందుకు వైసీపీకి చెందిన నేతలు అధిక సంఖ్యలో ఆసక్తి చూపిస్తున్నప్పటికీ పవన్ కళ్యాణ్ విధించిన పరిమితులతో అందరినీ చేర్చుకోవడంలేదట. ముఖ్యంగా అధికారం ఉందనే అహంకారంతో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలపై రాజకీయ వేధింపులకు పాల్పడిన వైసీపీ నేతలను చేర్చుకోకూడదని పవన్ కళ్యాణ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అవినీతి ఆరోపణలు ఉన్న నాయకులను దూరం పెట్టాలని ఇప్పటికే పవన్ కళ్యాణ్ తన పార్టీ సీనియర్లకు చెప్పారట. ఎక్కడైనా ఇతర పార్టీల నుంచి కొత్త నాయకులను చేర్చుకుంటే అక్కడ ఇప్పటికే ఉన్న స్థానిక నాయకుల గౌరవానికి ఎలాంటి భంగం కలగకుండా ఉండేలా చూడాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. దీంతో ఎక్కువమంది పార్టీలోకి వచ్చేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తున్నా పవన్ పెట్టిన పరిమితులతో కొందరికే గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు తెలుస్తోంది.

## మోదీ పాలనకు ప్రజాభి'వంద'నం



వికసిత్ భారత్ సంకల్పం సాకారం లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ బలమైన పునాదులు వేస్తున్నారు. ఒక నిర్ణయాత్మక, మహా సంకల్ప సాధన కోసం మార్గనిర్దేశనం చేస్తున్నారు. మునుపెన్నడూ లేనిరీతిలో సమాజంలోని ప్రతి వర్గానికి సాధికారతనిచ్చేలా దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటూ, సంక్షేమ పథకాలు చివరి వ్యక్తి వరకు చేరేలా పాలన అందిస్తున్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా పేదలు, మధ్యతరగతి, అణగారిన ప్రజల అభ్యున్నతి, సంక్షేమం కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చారు. మోదీ 3.0 మొదటి వందరోజుల పాలనలో రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులతో వ్యవసాయం, మౌలికవసతులు సహా వివిధ కీలక రంగాలకు పెద్దపీట వేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుంది. మోదీ పాలనను పరుగులు పెట్టిస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు, విద్య, వైద్యం, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వేలు, భద్రత, ఇంధనం, సాంకేతికత వంటి అనేక రంగాలలో గత వంద రోజుల పాలనలో మోదీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంది. దేశ ప్రగతిలో గణనీయ భాగస్వామ్యం రీత్యా వ్యవసాయానికి భవ్యమైన భవిష్యత్తును కల్పించేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది. రైతుల సమస్యల పరిష్కారంతో పాటు ఆదాయం రెట్టింపు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ఇటీవల పీఎం కిసాన్ నిధి 17వ వాయిదా కింద 9.3 కోట్ల మంది రైతులకు 20 వేల కోట్లు అకౌంట్లలో జమచేసింది. వంద రోజుల పాలనలో వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ.. గ్రామీణ పరిశ్రమలు, స్టార్టప్ కంపెనీలకు అండగా నిలిచేలా 750 కోట్ల రూపాయలతో 'అగ్రిష్యూర్' పథకాన్ని ప్రారంభించింది. గోధుమలను నిల్వ ఉంచడానికి 3 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ధాన్యాగారాలను ఏర్పాటు చేసింది. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు కనీస మద్దతు ధరను పెంచి, రైతాంగానికి రూ.2 లక్షల కోట్లు ప్రయోజనం చేకూర్చింది. వ్యవసాయాన్ని సుస్థిరం చేసేందుకు ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాలకు విధివిధానాల రూపకల్పన చేసింది. విపత్తుల నుంచి రైతులను రక్షించేందుకు అవసరమైన వ్యవస్థను నిర్మించింది. 2 వేల కోట్ల నిధులతో 'మిషన్ మౌసం' పథకాన్ని ప్రవేశపెట్టింది. మత్స్యకార రంగం బలోపేతానికి 5 ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులను ఏర్పాటు చేసింది. ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా రూ.28,602 కోట్లతో దేశవ్యాప్తంగా 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీస్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 2,361 కోట్ల నిధులతో ఒక ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని తెలంగాణలోని జహీరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. తెలంగాణ-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటయ్యే ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణతో పాటు కర్ణాటకలోనూ పారిశ్రామికాభివృద్ధి మరింత వేగంగా ముందడుగు వేయనుంది. హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని న్యాలకల్, ఝరాసంగం మండలాల్లోని 17 గ్రామాల్లో జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం కేంద్రంగా ఈ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ నిర్మాణం జరగనుంది. ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారతదేశంలో లాజిస్టిక్స్ రంగాన్ని బలోపేతం చేసేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, బొగ్గు, ఇనుప ఖనిజం, ఉక్కు, సిమెంట్, బాక్సైట్, సున్నపురాయి, అల్యూమినియం పౌడర్, గ్రానైట్, బ్యాలస్ట్, కంటైనర్లు మొదలైన సరుకుల రవాణాకు కనెక్టివిటీ పెంచడంపై దృష్టి సారించింది. ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడం, సరుకు రవాణా వ్యయాన్ని తగ్గించడం, చమురు దిగుమతి, కర్బన ఉద్గారాలను తగ్గించడం లక్ష్యంగా, రోడ్డు, రైలు, ఓడరేవులు, వైమానికమార్గాల కనెక్టివిటీని, ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడం కోసం 3 లక్షల కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపట్టింది. ప్రపంచంలోనే 10 అత్యుత్తమ ఓడరేవుల్లో ఒకటిగా నిలిచేలా 76,000 కోట్ల నిధులతో మహారాష్ట్రలో 'వదవాన్' ఓడరేవుకు శంకుస్థాపన చేసింది. వివిధ రాష్ట్రాలలో 900 కిలోమీటర్ల మేరకు రైల్ నెట్‌వర్క్‌ను విస్తరించేలా 24,600 కోట్ల రూపాయలతో 8 నూతన రైల్వే లైన్ ప్రాజెక్టులు ప్రారంభించింది. ఇందులో తెలంగాణ నుంచి కూడా ఓ రైల్వే లైను ఉంది. 4,109 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో.. భద్రాచలం-మల్కన్‌గిరి మధ్య 173 కి.మీ.ల ప్రాజెక్టుకు ఆమోదముద్ర పడింది. 900 కిలోమీటర్ల మేర 8 జాతీయ రహదారుల అభివృద్ధికి 50,600 కోట్ల రూపాయలు కేటాయించింది. దేశంలో 70 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య భీమా వర్తింపచేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో దాదాపు 4.5 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. వృద్ధులు 5 లక్షల రూపాయల వరకు ఉచిత చికిత్స సౌకర్యాన్ని పొందే అవకాశం ఉంటుంది. తెలంగాణ నుంచి అదనంగా మరో 10లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. ఖరీదైన మూడు కేన్సర్ ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని మినహాయించింది. మెడికల్ కాలేజీల సంఖ్య పెంచి, అదనంగా 75 వేల సీట్లను పెంచి వైద్య విద్యను ప్రోత్సహిస్తోంది. సైన్స్, టెక్నాలజీ రంగంలో సృజనాత్మకతకు పెద్దపీట వేసేలా.. రూ.10,600 కోట్లతో విజ్ఞాన్ ధారా పథకాన్ని ప్రారంభించింది. భారతదేశం నానాటికీ బలం పుంజుకోవడానికి మూలం దేశంలోని యువశక్తే. అందుకే వారిని మరింత శక్తిమంతం, స్వయంసమృద్ధం చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. అందుకు అనుగుణంగా యువతకు ఉపాధి, స్వయం-ఉపాధి లక్ష్యంగా ఎన్నడూ లేనిరీతిలో అవకాశాలు కల్పించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం. యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం 2 లక్షల కోట్ల నిధులతో ప్రధానమంత్రి ప్యాకేజిని ఏర్పాటుచేసింది. దీంతో 4.1 కోట్ల మంది యువతకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీని నిరోధించి, పారదర్శకత తీసుకొచ్చేందుకు ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. తెలంగాణలో పేపర్ లీకేజీలతో లక్షల మంది యువత జీవితాలు బుగ్గిపాలయ్యాయి. కీర్తి (ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్) కార్యక్రమం తీసుకొచ్చి, అనేక మంది క్రీడాకారులకు ప్రోత్సహిస్తోంది. మహిళలు కొనుగోలు చేసే ఆస్తులపై స్టాంప్ డ్యూటీ తక్కువ ఉండేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తోంది. నారీ శక్తికి లబ్ధి చేకూర్చేలా అభివృద్ధి పథకాలకు 2024-25 బడ్జెట్‌లో 3 లక్షల కోట్లు కేటాయించింది. 48 లక్షల మంది స్వయం సహాయక బృందాల సభ్యులకు లబ్ధి చేకూరేలా 4.3 లక్షల మందికి 2,500 కోట్ల రూపాయలతో రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేసింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, సంరక్షణ కోసం, వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024ను ప్రవేశపెట్టింది. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు పీఎం సూర్యఘర్ ముక్త్ బిజిలి యువజన పథకం కింద భారీ సబ్సిడీ పథకాన్ని తీసుకొచ్చింది. 3.5 లక్షల ఇండ్లలో సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నది. దేశాన్ని వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దే క్రమంలో రెన్యూయబుల్ ఎనర్జీ (సోలార్ంవిండ్ంహైడ్రోజన్)పై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను నిర్ధారించింది. పెట్రోలులో 20 శాతం ఇథనాల్ మిక్స్‌తో రైతులకు సంవత్సరానికి రూ.50 వేల కోట్ల అదనపు ఆదాయం లభించనుంది. 2030 నాటికి భారతదేశం 500 గిగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ప్రతి రైల్వేస్టేషన్ సీలింగ్‌పై సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేస్తున్నది. దేశ వ్యాప్తంగా 63,000 గ్రామాల్లోని 5 కోట్ల మంది గిరిజనుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి ప్రధానమంత్రి జన్ జాతియా ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకాన్ని తీసుకొచ్చింది. చెత్త సేకరించే వారి కోసం నమస్తే పథకానికి శ్రీకారం చుట్టి, వారి సామాజిక, ఆర్థిక సాధికారతకు దోహదపడుతోంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందడానికి 2.9 లక్షలకు పైగా దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం వలస చట్టాల స్థానంలో మూడు కొత్త క్రిమినల్ చట్టాలు తెచ్చింది. వీటిలో శిక్ష కన్నా న్యాయంపైనే దృష్టి పెట్టింది. 2250 కోట్ల నిధులతో నేషనల్ ఫోరెన్సిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీమ్ ప్రవేశపెట్టి సకాలంలో, శాస్త్రీయంగా ఆధారాల పరిశీలన చేస్తున్నది. ఒడిశా, జార?ండ్, బిహార్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్‌ల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పూర్వోదయ ప్రణాళిక రూపొందించారు. మోదీ తీసుకున్న ప్రతి నిర్ణయం, ప్రతి కార్యక్రమం వికసిత్ భారత్ ఏ2047కు దోహదం చేసేదే.